క్లుప్తంగా

అంకాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు



అంకాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరులో ఆదివారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నర్సారెడ్డి కొమ్మాశివ సుమన్‌రెడ్డి, శివస్టాలిన్‌రెడ్డిలు ఏర్పాటు చేసిన విందులో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని అంకాలమ్మతల్లి ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కసనూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజులరెడ్డి, వెంకటరామిరెడ్డిలు ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి..



ప్రత్యేక అలంకరణలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు కోరిన కోర్కిలు తీర్చే గంగమ్మతల్లిగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ప్రతి వారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారీ సంఖ్యలో తరలి వస్తుంటారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు భక్తులకు అన్ని సదుపాయలు ఏర్పాటు చేశారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లిని ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, గంధం, పసుపు, వేపాకు నిమ్మకాయలు, పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు పట్టి కోళ్లు, పొట్టేలు, మేకపోతులను బలిగా ఇచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు.

ఘనంగా బర్సీ మహోత్సవం



బర్సీ మహోత్సవానికి హాజరైన భక్తులు

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియా, జహీరియా స్వర్గీయ పీఠాధిపతి హాజి జహీరుద్దీన్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి పీఠాధిపతి, సజ్జాద్–ఏ–నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, దర్గా కన్వీనర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో బర్సీ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జన సందోహం నడుమ పీఠాధిపతి నివాసం నుంచి జహీరియా దర్గా వరకు గంధం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి వారి మజార్లపై గంధం ఎక్కించి, పూల చాదర్లు సమర్పించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. రాత్రి నాత్ చదివారు. అనంతరం బయాన్ చేశారు. పీఠాధిపతి సోదరులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాత మార్కెట్‌లో దుర్గంధం



శారదానిలయం సమీపంలోని అపార్ట్‌మెంట్ వద్ద చెత్తాచెదారం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని పాత మార్కెట్, దాని చుట్టు ప్రక్కల ప్రాంతాలు చెత్తతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. శనివారం బక్రీద్, ఆదివారం సెలవు దినం కావడంతో పాత మార్కెట్, దాని చుట్టూ ఉన్న ప్రాంతాల్లో ఎక్కడచూసినా చెత్త దిబ్బలే కనిపిస్తున్నాయి. కుళ్లిన కూరగాయలు, చెత్త, ఇతర వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేశారు. జంతు వధశాల, శారదా నిలయం స్కూల్ ప్రాంతాల్లోనూ చెత్త కనిపిస్తోంది. వాటిని ఆవులు, పందులు, కుక్కలు చెల్లాచెదురుగా పడేస్తుండడంతో భరించలేని దుర్వాసన వస్తోంది. అలాగే చెత్తా, చెదారంపై ఈగలు, దోమలు వాలడం అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. నగరపాలక అధికారులు స్పందించి ఈ చెత్తాచెదారాన్ని శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చినుకు పడితే మడుగులే..!

- ప్రధాన రోడ్లపై నిలుస్తున్న వర్షపునీరు
- దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలే ప్రమాదం
- శిథిల రోడ్లతో పట్టణ వాసుల అవస్థలు



తాళ్లపల్లెలోని పాఠశాల వద్ద ఉన్న నీటిలో మంచం వేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు (ఫైల్)

వేంపల్లె : చిన్నపాటి వర్షం వస్తే చాలు మండలంలోని ఎగువతువ్వపల్లె, తాళ్లపల్లె గ్రామాల్లోని ప్రధాన రోడ్లతోపాటు వేంపల్లె పట్టణంలోని ప్రధాన రోడ్లు మురుగు కుంటలు, నీటి మడుగుల్లా మారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఎప్పుడో వేసిన రోడ్లు కంకర తేలి ఏ మాత్రం ఆదమరిస్తే కిందపడి కాలో చేయో విరగొట్టుకునే దుస్థితి నెలకొందని ఆయా ప్రాంతాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రధాన రహదారులను బాగు చేయాలని కోరుతున్నారు. ఇటీవల ఆ ప్రాంత వాసులు రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో మంచం వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రోడ్లలో వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీతోపాటు సీసీ రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలో గుంతలుగా మారిన రోడ్లు

వేంపల్లి పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా గృహాలు, దుకాణ సముదాయాలు పగులగొట్టి 72 అడుగుల మేర గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్డు వెడల్పు చేశారు. అయితే కొంత మేర రోడ్డు కిరువైపులా డ్రైనేజీ, సిమెంటు రోడ్డు పనులను చేపట్టారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఏడాది పూర్తవుతున్న ప్రభుత్వం, స్థానిక కూటమినేతలు పట్టించుకున్నా పాపాన పోలేదు. కావున కొద్దిపాటి వర్షం వచ్చినా వర్షపునీరు నిలబడి గుంతలుగా మారాయి. స్థానిక కూటమి నేతలు ప్రధాన రోడ్లపై దృష్టి సాధించి వెంటనే సిమెంటు రోడ్లు వేసి పట్టణ వాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

చెరువును తలపిస్తున్న గ్రామాల ప్రధాన రోడ్లు

చిన్నపాటి వర్షాలకు కూడా మండలంలోని ఎగువతువ్వపల్లె, తాళ్లపల్లె ప్రధాన రోడ్లలో వర్షపు నీటితో చెరువును తలపిస్తోంది. ఎగువతువ్వపల్లె ప్రాథమిక పాఠశాల ముందర ప్రధాన రోడ్డు ఇటీవల సిమెంటు రోడ్డు మంజూరు కాగా టీడీపీ నాయకుల ఆధిపత్య పోరుతో ఒక వర్గం వారు రోడ్డు వేయకుండా నిలిపివేశారు. అలాగే తాళ్లపల్లె గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో డ్రైన్ నిర్మాణం చేపట్టక రోడ్డు నిర్మించడంతో వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందని వాపోతున్నారు. రోడ్డు పక్కనే ప్రాథమిక పాఠశాల ఉండడంతో పిల్లలు బడికి వెళ్లాలంటే నీళ్లలోనే వెళ్లే పరిస్థితి నెలకొంది.



ఎగువ తువ్వపల్లెలో వర్షం నీటిలో ఆడుకుంటున్న చిన్నారులు



వేంపల్లె లో గుంతల రోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామలారెడ్డి, తదితరులు (ఫైల్)

వర్షపు నీటిలోనే నడవాలి



చిన్నపాటి వర్షం వస్తే చాలు తువ్వపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద నీటి మడుగులా మారుతోంది. వృద్ధులు, చిన్నపిల్లలు ఆ రోడ్డులో వెళ్లాలంటే నీటిలోనే నడిచి వెళ్లాలి. దీంతో పలువురు కిందపడి గాయాల పాలైన సందర్భాలు అనేకంగా ఉన్నాయి. వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు మాలాంటి వారు ఇబ్బందులు పడకుండా సిమెంటు రోడ్లు నిర్మించాలి.

– వి.చంద్రశేఖర్, గ్రామస్తుడు, తాళ్లపల్లె, వేంపల్లె

గుంతలమయంగా మారిన రోడ్లు



వేంపల్లె పట్టణంలో ప్రధాన రోడ్లు చిన్నపాటి వర్షానికి గుంతలమయంగా మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 72 అడుగుల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాదైనా ప్రధాన రోడ్లలో సిమెంట్ రోడ్లు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షపు నీరు డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో పాదాచారులు, వాహనదారులు బయటికి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. అధికారులు, స్థానిక కూటమి నేతలు స్పందించి ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న ప్రధాన రోడ్లు విస్తరణ పనులు పూర్తి చేయాలి.

– రవిశంకర్ గౌడ్, స్థానికుడు, వేంపల్లె

10న వ్యవసాయ కూలీల ధర్నా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పాలకులు మారుతున్నా.. వ్యవసాయ కూలీల బ్రతుకులు మారడంలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న కడప జిల్లాలోని మండల కేంద్రాల్లో నిరసన తెలిపి అధికారులు వినతిపత్రం అందజేస్తామన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేశారన్నారు. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర బడ్జెట్లోగానీ నిధుల కేటాయింపు జరగడంలేదని తెలిపారు. రైతులు ముస్లిం మైనార్టీలపై దాడులు చేయడమేగాక, వారికి వ్యతిరేకమైన చట్టాలను తీసుకొస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు ఒక్కటీ అమలు కాలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలాలిచ్చి ఇల్లు నిర్మిస్తామని చెబుతున్నా అడుగు ముందుకు వేయలేదన్నారు. అదే విధంగా ఉచిత బస్సు ప్రయాణం, మూడు సిలిండర్లు ఇవ్వాలని కోరారు. వందల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని, ఉన్నతాధికారులు దృష్టిపెట్టి ప్రతి వ్యవసాయ కూలీకి పనికి తగిన కూలీ పెంచాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, ప్రధాన కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు బ్రహ్మం, పొంగూరు నాగరాజు, కష్ట శ్రీను, తిరుపాల్ పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత

కడప అర్బన్: మహిళలు, బాలికల రక్షణకు ఆపద సమయంలో శక్తి యాప్ ఉపయోగపడుతుందని రిమ్స్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యం గురించి ఆదివారం సాయంత్రం కడప శివారులోని శిల్పారామం సందర్శకులకు ఆదివారం అవగాహన కల్పించారు.

యథేచ్ఛగా చౌక బియ్యం అక్రమరవాణా

ముద్దనూరు : ప్రజాపంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం అక్రమ మార్గంలో తరలిపోతున్నాయి. పేదల ఆకలితీర్చడానికి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని పెద్దల చేతుల్లోకి వెళ్తున్నాయి. చౌకదుకాణాల్లో పంపిణీ చేసే బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలుచేస్తున్నారు. లబ్ధిదారుల నుంచి ఇంటింటికి వెళ్ళి 1 కిలో బియ్యాన్ని సుమారు 14 రూపాయాలకు దళారులు కొనుగోలుచేస్తున్నారు. దళారులు సేకరించిన ఈ బియ్యాన్ని బియ్యం వ్యాపారులు, కొంతమంది పెద్దలు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. చౌకదుకాణంలో బియ్యం సరఫరా చేసే రోజు నుంచి సుమారు 20 రోజుల వరకు ఈ తతంగం కొనసాగుతోంది. ఈ మధ్య కాలంలో ప్రతి నిత్యం ఆటోలలో ముద్దనూరు మండల కేంద్రం నుంచి ఈ రవాణాసాగుతోంది. ఆటోలలో తరలిచిన ఈ బియ్యాన్ని జమ్మలమడుగు రహదారిలోని శివాలయం వద్ద నున్న జగనన్న కాలనీలో స్టాకు చేస్తున్నారు.అనంతరం ఈ బియ్యాన్ని లారీల్లో తరలిస్తున్నారనే ఆరోపణలు న్నాయి. ముద్దనూరు కేంద్రంగా కొండాపురం, జమ్మలమడుగు ప్రాంతాలకు చౌకదుకాణం బియ్యం రవాణా జరుగుతున్నట్లు సమాచారం. దీనితో పాటు ప్రొద్దుటూరు ప్రాంతం నుంచి ఆర్టీపీపీ, ముద్దనూరు మీదుగా పులివెందుల ప్రాంతానికి, మరో దారిలో ఆర్టీపీపీ, చిలంకూరు, ఉప్పలూరు మీదుగా గ్రామీణ రహదారుల గుండా ఈ అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. బహిరంగంగానే వాహనాల్లో చౌకదుకాణం బియ్యం అక్రమ రవాణాజరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉన్నతాధికారులు స్పందించి చౌకదుకాణ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరతున్నారు.

రాష్ట్ర జర్నలిస్టుల టోర్నీ విజేతగా కడప టీం



జట్టు సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల రూరల్ : గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల టోర్నమెంట్‌లో వైఎస్సార్ కడప జిల్లా జట్టు విజయం సాధించడంతో శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి జట్టు సభ్యులను ఆదివారం ఆయన నివాసంలో అభినందించారు. అనంతరం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో జట్టు సభ్యులకు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయులు కేవలం పత్రికా రంగంలోనే కాక క్రీడా రంగంలో రాణించాలన్నారు. అలాగే త్వరలో జరిగే రాష్ట్రస్థాయి జర్నలిస్టల క్రీడా పోటీలకు తాను పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

పరీక్ష ఫలితాల్లో బాలికల హవా

పులివెందుల టౌన్ : సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో వైఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. ఆదివారం ఆయన తెలుపుతూ మొదటి సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలలో ఎంపీసీ గ్రూపు నుంచి జోష్ణ 470 మార్కులకు 464 మార్కులు సాధించగా బైపీసీ గ్రూపు నుంచి హలీమా సాదియా 440 మార్కులకు గాను 429 మార్కులు సాధించింది. భాను 429 మార్కులు సాధించింది. అలాగే సీఈసీలో చైతన 500 మార్కులకుగాను 481 మార్కులు సాధించింది. హెచ్‌ఈసీ ఆర్.సునీత 500 మార్కులకు 496 మార్కులు సాధించినట్లు తెలిపారు.

షైనింగ్‌స్టార్స్‌కు ఇద్దరు విద్యార్థినులు ఎంపిక

ప్రభుత్వం ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్స్ విద్యార్థుల ఎంపికలలో పులివెందుల వైఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు ఇద్దరు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సీఈసీ విభాగం నుంచి వైజయంతి 968 మార్కులు, హెచ్‌ఈసీ విభాగంలో రిచురు 914 సాధించినట్లు ఆయన తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిడం పట్ల కళాశాల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

సూచిక బోర్డులను సరిచేయండి



కింద పడిపోయిన సూచిక బోర్డు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రభుత్వ పథకాలకు సంబంధించి అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద పథకాలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేశారు. అవి కొద్ది రోజులు భాగానే ఉన్నాయి. తర్వాత బోర్డులు పడి పోయినా వాటి గురించి పట్టించుకునే అధికారులు కరువయ్యారు. దీన్ని బట్టి చూస్తే కూటమి ప్రభుత్వంలో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారో అర్థం అవుతుంది. ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఆవరణ సమీపంలో బోర్డులు పడి ఉన్నాయి. ఇప్పటి కైనా అధికారులు వాటిని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

యూత్ వింగ్‌ను బలోపేతం చేద్దాం

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు



రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసిన హేమంత్‌రెడ్డి

కడప కార్పొరేషన్: రాయలసీమ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగాన్ని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి, కడప మేయర్ కె.సురేష్‌బాబు సూచించారు. వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ రాయలసీమ రీజనల్ కో ఆర్డినేటర్ హేమంత్‌రెడ్డి వారిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువతకు చేసిందేమీలేదని, యూత్ వింగ్‌ను బలోపేతం చేసేందుకు ఇదే మంచి సమయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ షఫీ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



ప్రధానోపాధ్యాయుడికి చెక్కును అందిస్తున్న పూర్వపు విద్యార్థులు

జమ్మలమడుగు : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు పూర్వపు విద్యార్థులు పాఠశాల ప్రహారి గోడలపై దేశ నాయకుల గోడ చిత్రాలను వేయించడం కోసం రూ.30 వేలు వితరణ చేశారు. ఆదివారం 1975–76 బ్యాచ్‌కు సంబంధించిన విద్యార్థులు పదవ తరగతి పూర్తి చేసుకుని 50 సంవత్సరాలైన సందర్భంగా సున్నపురెడ్డి సూర్యనారాయణ రెడ్డి తోటలో విద్యార్థులందరూ కలసి ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయరెడ్డికి చెక్కును అందించారు. నేటి విద్యార్థులు దేశ నాయకుల, సంఘ సంస్కర్తలు, శాస్త్రవేత్తల చిత్రాలు వేసి వారికి తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, అన్వర్, శ్రీనివాసమూర్తి, జయరాం తుపాకుల చంద్ర ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలి, వానకు నేలకొరిగిన అరటి



గాలివానకు దెబ్బతిన్న అరటిపంట

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామంలో ఆదివారం వాన, ఈదురుగాలులతో రామ్మోహన్ రెడ్డి, కేశవరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవి చంద్రారెడ్డి తదితర రైతులు అరటి పంటను తీవ్రంగా నష్టపోయారు. సంబంధిత అధికారులు పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఉత్తమ విద్యాసంస్థలకు నిలయం కడప

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా కేంద్రం కడపలో అత్యుత్తమ విద్యా సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ కడప నగరంతోపాటు చుట్టు ప్రక్కల సుమారు 30 కిలోమీటర్ల పరిధిలోని విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం కలుగుతోంది. ప్రతి రోజూ వందలాది విద్యార్థులు నగరానికి వచ్చి విద్యాభ్యాసం చేస్తున్నారు. అలాగే సుదూర ప్రాంతాల పిల్లలు ఇక్కడి విద్యా సంస్థల ప్రాధాన్యం గుర్తించి అద్దె ఇల్లు, హాస్టళ్లలో ఉంటూ చదువు కొనసాగిస్తున్నారు. విద్యార్థినులు కూడా వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లలో ఉంటూ తమ బంగారు భవిష్యత్తుకు బాటలు పరుచుకుంటున్నారు. నగరంలోని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలకు అనుబంధంగా హాస్టల్ ఉండడం గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగకరంగా మారింది. కడప ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, పీజీ, డిగ్రీ, ఇంటర్ నుంచి ఎల్‌కేజీ వరకు పేద, మధ్యతరగతి వర్గీయులు సులభంగా విద్యాబుద్ధులు నేర్చుకునే అవకాశం కలిగింది. ముఖ్యంగా పది, ఇంటర్మీడియేట్‌లో కడప విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధిస్తూ తమ సత్తా చాటుతున్నారు. పాఠశాల యాజమాన్యాలు విద్యాబోధన విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ నిరంతరం విద్యార్థులను పర్యవేక్షిస్తున్నారు. తమ విద్యార్థులు అన్ని అంశాల్లో ముందుండేలా తీర్చిదిద్దుతున్నారు. అత్యుత్తమ మార్కులు సాధిస్తూ కడప పేరు చాటి చెబుతున్నారని పలువురు విద్యావేత్తలు కొనియాడుతున్నారు. ఇక్కడి విద్యా సంస్థల్లో చదువుకున్న విద్యార్థులు నేడు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉంటూ కడప ఘనత చాటుతున్నారు. ఇంజనీరింగ్ తోపాటు, ఫార్మసీ, నర్సింగ్, పీజీ, ఐటీఐ కళాశాలల విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతున్నాయి.

విత్తన శుద్ధి, పంట మార్పిడితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఎం.బాలకృష్ణ

కమలాపురం : పంటలు సాగు చేసే రైతులు విత్తన శుద్ధి, పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే అధిపతి ఎం.బాలకృష్ణ తెలిపారు. ఆదివారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దేవరాజుపల్లె, సముద్రంపల్లె, జీవంపేట, చిన్నపుత్త, దాదిరెడ్డిపల్లె, అప్పారావుపల్లె, గొల్లపల్లె, జంభాపురం గ్రామాల్లో పండించే వివిధ రకాల పంటలైన వేరు శనగ, వరి, మినుము, కొర్ర పంట సాగు విధానాలపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ముందుగా భూసార పరీక్షలు చేపట్టాలన్నారు. అలా చేయడం వలన భూమిలో ఉన్న పోషకాలను బట్టి ఎరువుల మోతాదును వినియోగించవచ్చన్నారు. తద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. చిరుధాన్యాల పరిశోధన కేంద్రం హైద్రాబాద్ శాస్త్రవేత్తలు బి.సుబ్బరాయుడు, జి.శ్యాంప్రసాద్, ఏపీ ఉమాకాంత్ మాట్లాడుతూ రైతులందరూ చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా కొర్ర, మొక్క జొన్న తదితర పంటల్లో పోషక యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు. కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ వేరుశనగ, మినుము, కొర్ర, వరి తదితర వంగడాల సాగులో జిప్సం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. విత్తన శుద్ధి, పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఉద్యాన పంటల శాస్త్రవేత్త ఫిరోజ్ హుసేన్ ఉద్యాన పంటల ఆవశ్యకతను వివరించారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం, మార్కెటింగ్ తదితర వివరాలపై అవగాహన కల్పించారు. మండల ఏఓ సరస్వతి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాల లభ్యత, పంపిణీ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఏఏలు, వీహెచ్ఏలు రైతులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చింతకొమ్మదిన్నె : బయనపల్లెలోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కొత్తపేట గంగమ్మ దేవాలయం సమీపంలో సమావేశం నిర్వహించుకున్నారు. పూర్వవిద్యార్థులు ఒకేచోట కలవడంతో తమ తోటి విద్యార్థుల, టీచర్ల యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమ వృత్తులు, పిల్లల చదువుల గురించి చర్చించుకున్నారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు దీనదయాల్, రిటైర్డ్ టీచర్లు కృష్ణయ్య, శెట్టి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని కొండాపురం జెడ్పీ ఉన్నతపాఠశాలలో ఆదివారం 1997–98 సంవత్సర పదో తరగతిబ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ చదువుతో ఈ రోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. ఆనాటి గురువులు వెంకటేశ్వర్లు, రాజారెడ్డి, చెంచిరెడ్డి, కృష్ణమూర్తి, జయరాజు, జోసఫ్, ఎంఈఓ లక్ష్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. పూర్వవిద్యార్థులు వైకుంఠ రథంకు రూ.1.80 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రస్తుత ఎంఈఓలు ఓబులేసు, రామయ్యలు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సింహాద్రిపురంలో అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

సాహిత్య కార్యక్రమాల సారథి 'గానుగపెంట'

కడప కల్చరల్: వైఎస్సార్ కడప జిల్లాలోని సాహిత్య కార్యక్రమాలకు సాహితీవేత్త గానుగపెంట హనుమంతరావు సారథిగా వ్యవహరించి తన ప్రత్యేకత చాటుతున్నారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గానుగపెంట హనుమంతరావును అభిమానులు ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ హనుమంతరావు ఏర్పాటు చేసిన సాహిత్య సంస్థలు, పలు సాహిత్య పీఠాలు, సాహిత్య సంస్థల నిర్వహణతోపాటు ఆయన రచించిన పలు పుస్తకాల గురించి వివరించారు. పెన్నేర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ మూడు రాష్ట్రాల గవర్నర్లతో జీవిత సాఫల్య పురస్కారాలను అందుకున్న ఘనత హనుమంతరావుకే దక్కిందన్నారు. పెన్నేర్ల సంఘం కోశాధికారి నూనె నగేష్, ఇతర ప్రతినిధులు తుపాకుల నారాయణ, సుబ్బరాయుడు, లింగమూర్తి, అంజిబాబు, గోవిందు నాగరాజు, గానుగపెంట మనోజ్, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, భూమిరెడ్డి రవి కల్యాణ్, మధుబాబు, ప్రసాద్, రమణమూర్తి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.